క్లుప్తంగా

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి గ్రామంలో శ్రావణమాసం మూడో శుక్రవారం కావడంతో సామూహిక వ్రతాలు ఏర్పాటు చేశారు. అందుకు తగ్గట్టుగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అలాగే గురువారం మార్కెట్లలో వరలక్ష్మీ వ్రతం సందడి నెలకొంది. పూలమార్కెట్లు, పండ్ల దుకాణాలు, వస్త్రాల దుకాణాలు ఖాతాదారులతో కళకళలాడాయి.

తాగునీటి ట్యాంక్ ప్రారంభం

సఖినేటిపల్లి: గ్రామంలో నూతనంగా నిర్మించిన 40 వేల లీటర్ల తాగునీటి ట్యాంకును రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మంజూరు చేసిన పర్యావరణ పరిహార నిధులు రూ.32 లక్షలతో వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశామన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జీ.పెదకాపు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, మలికిపురం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, నాయకులు పాల్గొన్నారు.

76 మందికి ఉద్యోగాలు

మామిడికుదురు: మండలంలోని దీప్తి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరు కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్ మేళాకు వచ్చిన వారిలో 76 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందించారు. కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పరిసర ప్రాంతాల్లోనే వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని దీప్తి విద్యా సంస్థల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఐటీ డైరెక్టర్ అభిరామ్, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రతినిధులు సాగర్, జాన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మోకా రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ సిర్రా వారి మెరకలో లోఓల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోందని స్థానికులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారు ఎస్సీ, బీసీ కులాలకు చెందిన నిరుపేదలమని వాపోయారు. కిలోమీటరు దూరంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల తమ ప్రాంతానికి వచ్చే సరికి 240 ఓల్ట్స్ కాస్త 110 ఓల్ట్స్‌కు పడిపోవడం వల్ల తాము ప్రతిరోజు లోఓల్టేజీ సమస్య ఎదుర్కొంటున్నామన్నారు. చీకటి పడితే ఫ్యాన్లు తిరగట్లేదని, లైట్లు సరిగ్గా వెలగడం లేదన్నారు. తాగునీరు కూడా రావడం లేదన్నారు. తమ ప్రాంతానికి జల జీవన్ మిషన్ ద్వారా పైప్‌లైన్ వేసినా.. నీటి సరఫరా జరగట్లేదన్నారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీటిపై అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలన చేసి తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

మామిడికుదురు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ పదవీ స్వీకారం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా పెనుమాల లక్ష్మి, పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా మంజూరు చేసిన రూ.10 కోట్ల నిధులతో నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో రోడ్లను సీసీరోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మార్కెట్ కమిటీ సెక్రటరీ జి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

చవితి మహోత్సవాలకు అంకురార్పణ



చవితి ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న ఎమ్మెల్యే

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చవితి మహోత్సవాలకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం పందిరిరాట పాతి అంకురార్పణ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకటదుర్గ భవాని ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చవితి ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు ఆలయం ఏర్పాటు చేసిన ఉచిత మట్టి విగ్రహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, ఉప సర్పంచ్ పోలిశెట్టి రాజేష్, అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడో మరి..!

- అంగన్వాడీలకు భారమవుతున్న అద్దె భవనాలు
- అరకొరగా ప్రభుత్వ చెల్లింపులు
- సిబ్బందిపై పడుతున్న మెనూ భారం



మాచవరంలోని మెట్ల కాలనీలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

అంబాజీపేట: ప్రభుత్వం చెల్లించే నిధులతో అంగన్వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహించలేక ఆయా కేంద్రాల కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు వారి పాలిట పెనుభారంగా తయారవుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో భవనాల అద్దె కడుతున్నారు. కేంద్రాల్లోని పిల్లలకు వడ్డించే ఆహారానికి సంబంధించిన ఖర్చులు కూడా పెరిగిపోతున్న నేపథ్యంలో.. కొంతకాలంగా అంగన్వాడీ కేంద్రాలు మోయలేని భారంగా మారయని వాపోతున్నారు. పాలకులకు తరచూ సమస్యలను విన్నవించుకుంటూ.. పెరుగుతున్న భారాన్ని తొలగించాలని వేడుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చే నిధులతో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు కొన్నిచోట్ల సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో భవనానికి నెలకు రూ.2 వేలు, మండల హెడ్ క్వార్టర్‌లో రూ.4 వేలు అద్దె నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. దీంతో ప్రభుత్వం చెల్లించే అరకొర అద్దెకు భవనాలు దొరకక, అరుగులు మీదనే కాలం గడిపేస్తున్నారు. ఆయా కేంద్రాల నిర్వహణకు సంబంధించిన పరికరాలను దాచుకోవడం వారికి పెద్ద సమస్యగా మారుతుంది. పి.గన్నవరం నియోజకవర్గంలోని మొత్తం 301 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. నాలుగు మండలాల్లో 141 సొంత భవనాలు ఉండగా.. అద్దె లేనివి 24, అద్దె ఉన్నవి 136, రాజోలు నియోజకవర్గంలో మొత్తం 228 భవనాలు ఉండగా.. మూడు మండలాల్లో 139 సొంత భవనాలు, అద్దె లేనివి 28, అద్దె ఉన్నవి 61 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

అదనపు భారాన్ని మోస్తూ..

ఆహారం తయారీ కోసం నిత్యం కూరగాయలు, నిత్యవసర వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఒక్కో చిన్నారికి బియ్యం 75 గ్రాములు, వంట నూనె 5 గ్రాములు, కందిపప్పు 15 గ్రాముల చొప్పున చెల్లిస్తుంటారు. కూరగాయలు, పోపు సామాన్ల నిమిత్తం రూ.1.50 పైసలు, వంట గ్యాస్ నిమిత్తం 50 పైసలు మంజూరు చేస్తారు. పోపు సామాన్లతోపాటు కూరగాయల ధరలు పెరిగిపోతున్నా వీటిలో మాత్రం మార్పు ఉండటం లేదు. వంట గ్యాస్ ధర పెరిగినప్పటికీ అందులోనూ ఒక్కో విద్యార్థికి ఇచ్చేది 50 పైసలే. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తించే అంగన్వాడీ సిబ్బందికి ఈ వేతనాలు తప్ప మరొక ఆదాయం ఉండదు. కేంద్రాల నిర్వహణ కోసం పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని మోస్తూ.. కాలం వెల్లదీస్తున్నామని అంగన్వాడీలు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో సిబ్బందిపై పడుతున్న ఆర్థిక భారం గురించి సిబ్బంది ఇచ్చే విజ్ఞాపనలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా తెలియజేస్తున్నాం. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి వారానికి రూ.500 వరకు భారం పడుతుంది. ప్రస్తుతం ఉన్న ధరలను బట్టి మెనూలో మార్పులు చేయాలి. వీటన్నింటి గురించి అధికారులకు వివరిస్తాం.

– మహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంబాజీపేట

గర్భిణులకు వైద్య పరీక్షలు

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలో ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గురువారం గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు లక్ష్మి సౌజన్య 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా ముద్రగడ సూర్యనారాయణమూర్తి సత్రం ఆధ్వర్యంలో భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో పలు విభాగాలకు అత్యవసర వైద్య పరికరాల కోసం డిప్యూటీ సివిల్ సర్జన్ రాఘవేంద్రరావు గురువారం పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ప్రతిపాదనలు అందజేశారు. ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రికి ఏమి కావాలో ప్రతిపాదనలు ఇస్తే ఓఎన్‌జీసీ సంస్థ నుంచి నిధులు తీసుకొస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో రూ.1.2 కోట్ల వ్యయంతో అత్యవసర వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎమ్మెల్యేకి అందజేశారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

కొత్తపేట: పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయం సాధించిన మూర్తి కృతజ్ఞత పర్యటనలో భాగంగా ఆయన గురువారం కొత్తపేట నియోజకవర్గంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిశారు. ఉపాధ్యాయులు వివిధ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలకు సరఫరా చేస్తున్న బియ్యం బస్తాల స్కానింగ్ వద్ద సమస్యగా ఉందని, అసెస్మెంట్ షీట్స్‌లో ఆన్సర్ స్క్రిప్ట్ స్కాన్ చేసి అప్లోడ్ చేయడం వంటి విధానాలను రద్దు చేయించాలని కోరారు. కామన్ సర్వీస్ రూల్స్ కోసం కృషి చేయాలన్నారు. యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రమోషన్స్‌లో భాగంగా ఖాళీ అయిన 10 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు వెంటనే కారుణ్య నియామకాల్లో భర్తీ చేయాలని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిపై చర్చించారు. ఆయన వెంట రాష్ట్ర యూటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ, కొత్తపేట మండల శాఖ అధ్యక్షుడు కేపీసీహెచ్ సూర్యారావు, ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను బోధనకే పరిమితం చేయాలి

ఆలమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బోధించే ఉపాధ్యాయులందరికీ ఏవిధమైన యాప్‌ల భారం లేకుండా కేవలం విద్యాబోధనకే పరిమితం చేయాలని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. కృతజ్ఞత పర్యటనలో భాగంగా గురువారం ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ సంఘ సమావేశంలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఉపాధ్యాయులందరికీ యూటీఎఫ్ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, పుత్రకుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రజలను మోసం చేశారు



తూర్పుపాలెంలో పార్టీ జెండా ఆవిష్కరించిన సూర్యారావు



మానేపల్లిలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న శ్రీనివాసరావు

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. మండలంలోని కేశనపల్లి, తూర్పుపాలెంలో చంద్రబాబు బాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఇంటింటికీ వంచన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గొల్లపల్లి మాట్లాడుతూ, చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను మోసం చేశారని, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఊసే లేదని, ఏడాది దాటినా హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు మట్టపర్తి నాగేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రమ్మాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, తూర్పుపాలెం గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనందం రాంబాబు, ఎంపీటీసీ ఓగ్గు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజలు:
వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: చంద్రబాబు మోసపూరిత పాలనతో విసుగు చెందిన ప్రజలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు తెలుపుతున్నారని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ పర్యవేణలో మానేపల్లి, వాడ్రేవుపల్లి, నాగుల్లంక, మొండెపులంక గ్రామాల్లో గురువారం ఆయా గ్రామ శాఖల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏరుదాటాక తెప్ప తగలేశారని అన్నారు. బాబు పాలనలో కూటమి కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని మండిపడ్డారు. పేద ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను చంద్రబాబు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మందపాటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేసే వరకూ ప్రజల తరఫున పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ పితాని చంద్రకళ, నాయకులు పితాని నర్సింహరావు, మద్దుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు

కొత్తపేట: 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' కార్యక్రమం ఈ నెల 11 నుంచి కొత్తపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు తెలిపారు. గురువారం సాయంత్రం డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ (జీపీ) తదితరులతో కలిసి గ్రామ స్థాయి కార్యక్రమాల షెడ్యూల్‌ను నిర్ణయించారు. అనంతరం ఆ వివరాలను విలేకరులకు వివరించారు. 11న కొత్తపేట, మందపల్లి, 12న అవిడి, ఖండ్రిగ, 13న బిళ్లకుర్రు, మోడేకుర్రు, 14న గంటి, పలివెల, 19న వాడపాలెం, వానపల్లి గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేకంగా పరిశీలకులను నియమించామన్నారు. వారి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల పార్టీ, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ఉద్యోగులకు ఘనంగా సన్మానం

కొత్తపేట: మండలంలోని అవిడి సచివాలయంలో వివిధ విభాగాల ఉద్యోగులుగా పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారి వీడ్కోలు సన్మాన కార్యక్రమం గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సభకు సర్పంచ్ రెడ్డి చంటి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు రాజ్‌కుమార్, విశ్వనాథం, సాధనాల కృష్ణమూర్తి, పితాని శ్రీనివాస్, దుర్గతో సహా 12 మందిని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ప్రజలకు చేరువలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి నాయకుల సిఫార్సులకు అవకాశం లేకుండా కేవలం ప్రతిభను పరిగణలోకి తీసుకొని ఉద్యోగావకాశాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన ఉద్యోగులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, దానికి నిదర్శనమే బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లి దిలీప్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ సుంకర రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

ఆలమూరు: మండలంలోని బడుగు వానిలంకలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, డా.మోహన్ డయాబెటిస్, రమా దంత వైద్యశాలకు చెందిన వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొని 300 మందికి సేవలందించారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన ట్రస్ట్ చైర్‌పర్సన్ ఏజీపీ బి.విద్యాప్రసన్నను గ్రామస్తులు అభినందించారు. సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ కేతా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



బి.దొడ్డవరంలో తల్లిపాల వారోత్సవాల సమావేశం

ఆలమూరు: తల్లిపాలను గంట వ్యవధిలోనే అందించడం ద్వారా బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొత్తపేట డివిజన్ అడిషనల్ వైద్యాధికారి సుమలత అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. వైద్యారోగ్య సిబ్బంది తప్పనిసరిగా ఆయా గ్రామాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించాలన్నారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ర్యాలీని ఆమె ప్రారంభించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్స్ ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు వరం

మామిడికుదురు: తల్లిపాలు దేవుడు ఇచ్చిన వరమని, ముందుగా వచ్చే ముర్రిపాలను పిల్లలకు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బలక్ష్మి, విజయలత సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పెదపట్నం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, అప్పనపల్లి, ఈదరాడ తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యతను వివరించి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ గుబ్బల దుర్గ, ఎంపీటీసీ కడలి పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని మడుపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పినిపే విజయకుమారి, ముత్యాల గౌరీమణి, కముజు పల్లాలమ్మ తల్లిపాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మకాయల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ పంపాని వాణి, ఉప సర్పంచ్ పినిపే బుజ్జి, ఏఎన్ఎం రాకాపు రాజారత్నం, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్స్, తల్లులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఏపీగా మార్చేశారు


మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



మామిడికుదురులో సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

మామిడికుదురు: 14 నెలల పాలనలోనే చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు విమర్శించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం మామిడికుదురులో పార్టీ సీనియర్ నేత నయినాల రామకృష్ణ స్వగృహం వద్ద మండపేట నియోజకవర్గం ఇంచార్జ్ కటకంశెట్టి ఆదిత్య అధ్యక్షతన జరిగింది. కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయట్లేదన్నారు. కూటమి పాలనలో సాధించింది అక్రమ కేసులే తప్ప ఏమీ లేదన్నారు. నేరాలు పెరిగిపోయాయని, ఎంతో మంది మహిళలు హత్యలకు గురవుతున్నారని, యువతుల అదృశ్యం కేసులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గోగన్నమఠం, మగటపల్లి, కొమరాడ గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సర్కిల్ ముస్తఫా హైదర్, మండల కార్మిక శాఖ అధ్యక్షుడిగా తోట దుర్గాప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కట్టా హరీష్‌ను నియమించామని సూర్యారావు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నేతలు కంచి శ్రీరామ్, కుసుమ శ్రీధర్, కొల్లాబత్తుల వెంకటరమణ, కూనపరెడ్డి రాంబాబు, మోకా సురేష్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సత్కారం



సన్మానం పొందిన చేనేత కార్మికుల

మామిడికుదురు: జాతీయ చేనేత దినోత్సవాన్ని అప్పనపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీచౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిచ్చుక పోలిశెట్టి అధ్యక్షతన జరిగిన సభలో చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. చేనేత వృత్తినే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. చేనేత రంగం గడ్డు పరిస్థితిలో ఉందని, దాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ పిచ్చుక చిన్న, సంఘం అధ్యక్షుడు పిచ్చుక పోలిశెట్టి కోరారు. చేనేత రంగాన్ని ఆదుకునే దిశగా చర్యలు తీసుకుంటామని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిచ్చుక శ్యామ్, కార్యదర్శి భళ్ల వెంకటేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో కడి శ్రీను, పడవల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఆలమూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

ఆలమూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం నులిపురుగు దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలోని వివిధ గ్రామాల్లో వైద్యాధికారులు ఎస్.లక్ష్మి స్నేహలత, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించనున్న నులిపురుగు దినోత్సవ ఆవశ్యకతను వివరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఎంపీడీఓ రాజు, ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ ఆవిష్కరించారు. ఏడాది నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఆల్‌బెండజోల్ మాత్రలను అందిస్తామన్నారు. సూపరింటెండెంట్ మెహెర్ ప్రకాష్, హెచ్ఈఓ రాజా తదితరులు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ

అంబాజీపేట: రక్తహీనతను నివారిస్తున్న ఆల్‌బెండజోల్ మాత్రలను మండలంలోని అన్ని పాఠశాలలకు అందజేయాలని ఎంపీపీ వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో డీ వార్మింగ్ డే పోస్టర్‌ను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ, 1 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తారన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మామిడికుదురు: పాశర్లపూడి బాడవ జెడ్పీ హైస్కూల్లో పని చేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు కె.అనుపమ, జి.సీతారామలక్ష్మి, ఎం.ప్రవీణ, ఎల్.స్వాతిని ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కెఎస్‌వీ నాగోజీరావు అధ్యక్షతన జరిగిన సభలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో నలుగురు ఉపాధ్యాయులు ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ టి.నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేపర్ జెండానే ముద్దు



పాఠశాలలో పేపర్ జెండాలను ప్రదర్శిస్తున్న హెచ్‌ఎం

కొత్తపేట: 'ప్లాస్టిక్ జెండా వద్దు..పేపర్ జెండా ముద్దు' అనే నినాదంతో ప్రాథమిక పాఠశాల బాలలు పేపర్‌లతో జాతీయ జెండాలు రూపొందించారు. ఈనెల 15న 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్రేయపురం మండలం ర్యాలి మండల ప్రజా పరిషత్ ప్రధాన ఫౌండేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్‌కుమార్ సమక్షంలో 1, 2 తరగతులు చదువుతున్న 10 మంది బాలలు 7.9 సెంటీమీటర్– 7.9 అంగుళాల కొలతలు గల 79 జెండాలను 79 నిమిషాల్లో తయారు చేశారు. వాటితో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ హితమైన పేపర్‌లతో తయారుచేసిన జెండాలనే ఉపయోగించాలని సూచిస్తూ ఈ జెండాలు రూపొందించారని తెలిపారు. అందరూ పేపర్ జెండాలనే ఉపయోగించాలని పిలుపునిచ్చారు.